

# చీకటి వెలుగు

సామాజిక రాజకీయ అధ్యాత్మిక సాయంకాలపు దిన పత్రిక

నల్లగొండ, హైద్రాబాద్ | సంపుటి : 19 | సంచిక :109 | ఎడిటర్ : కంది సూర్యనారాయణ | 04-09-2026 శుక్రవారం | పేజీలు : 4 | వెల : రూ. 3



చీకటి వెలుగు దినపత్రిక

भास्कर वाणि दिन पत्रिक

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జీలు, ఫొటోగ్రాఫర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు, డీటీపీ ఆపరేటర్లు కావలెను

ఎడిటర్ :
కంది సూర్యనారాయణ
సెల్ : 9848052327


### తెలంగాణ రైతాంగానికి

# నీళ్లు ఇవ్వరా..?

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న..



**మిర్యాలగూడ:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫోన్ చేస్తే ఆటోలో యూరియా వచ్చేదని, కాంగ్రెస్ పాలనలో మాత్రం యూరియా కోసం రైతులు తమ చెప్పులను లైన్లలో పెట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. నల్లగొండ జిల్లాకు దరిద్రాన్ని తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నామని.. రక్తం రుచి మరిగిన కాంగ్రెస్ రాక్షస పులిని తెచ్చుకున్నామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడలో కేటీఆర్ ఈరోజు (గురువారం) పర్యటించారు. ఈ సందర్భంగా - మిగతా3లో

## భూభారతి పేరిట భూహారతి

**ఎంపి ఈటల**

**సికింద్రాబాద్:** ధరణి మారినా ధోరణి మారకపోగా.. భూభారతి తీసుకువచ్చి భూహారతి చేస్తున్నారు. మల్కాజిగిరి మినీ ఇండియా ఇక్కడ అన్ని రాష్ట్రాల, ప్రాంతాల వారున్నారు. రేవంత్ పుణ్యమా అని వందల కాలనీలు 22ఏ కింద నిషేధిత జాబితాలోకి వెళ్ళాయని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచ చరిత్ర హిట్లర్ ను దుర్మారుడుగా గుర్తు పెట్టుకుంటే, తెలంగాణ రేవంత్ రెడ్డిను గుర్తుపెట్టుకుంటుంది. చివరికి పి అండ్ టి కాలనీ, మహేంద్రహిల్స్ 22ఏ కింద పెట్టారు. అమ్ముకోకుండా, బ్యాంకులోనుకి పోకుండా చేస్తున్నారు. - ఇది ఒక తుగ్లక్ పాలన అని ప్రజలంటున్నారు. 22ఏ ను రద్దు చేయమని అడగడం లేదు. పేదల భూములు, ఇళ్లను జాబితా నుండి తొలగించమని అడుగుతున్నాం. తప్పు అధికారులు చేస్తే వారిని సర్వీస్ నుండి తొలగించండి. మీరు చేస్తే రాజీనామా చేయండి. 90 లక్షల మంది బాధితులున్నారు. నంగనాచి మాటలు బంద్ చేసి నిషేధాన్ని తొలగించాలి. ఇందిరాపార్క్ వద్ద 5, 6 వ తేదీల్లో బీజేపీ ఎంపీ, ఎంపీలు దీక్ష చేస్తున్నాం.

## ప్రజలకే మేం జవాబుదారీ

### మీడియా సమావేశంలో కొండా సురేఖ



**హైదరాబాద్:** అధిష్టానం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. ఒక్కమాట నాకు చెప్పలేదు.. నేరుగా భర్తరఫ్ చేసారని కొండా సురేఖ అన్నారు. గురువారం నాడు ఆమె మీడియాతో మాట్లాడారు. ఉరిశిక్ష అమలు చేసే సమయంలో కూడా ఉరివేస్తున్నాం..అని చెప్తారు.. చివరికోరిక ఏమైనా ఉందా అని అడుగుతారు. కానీ కావాలని కక్ష కట్టి కుట్ర చేసి తిరుపతి రెడ్డి... తదితరులు..నన్ను తీసేయించారని అన్నారు. సుమంత్ విషయంలో కూడా అంతా కుట్ర చేసారు..సుమంత్ పేరు చెప్పి నేరాలు సెటిల్మెంట్లు చేసి కావాలని బద్నాం చేశారు. సుమంత్ కేసును సీసీఎస్ కు బదిలీ చేసి టార్గెట్ చేసి మరీ వేధిస్తున్నారు. నేను మంత్రిగా ఉండగా మా ప్రభుత్వంలో ఇంత జరుగుతోంది. ఎవరైతే నన్ను బర్తరఫ్ చేయించిన వారిలో మల్లు రవి ఉన్నాడు.. ఆయన తిట్టలేదా పార్టీని. మాజీ సీఎం రోశయ్య ఏకంగా విధవ రాజ్యం ఏలుతోందని ఇందిరాగాంధీని తిట్టాడని - మిగతా3లో

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..



**హైదరాబాద్:** సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ (గురువారం) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం స్టీల్ బ్రిడ్జికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ వివరాలను ముఖ్యమంత్రికి జీహెచ్ఎంసీ అధికారులు వివరించారు. దీని ప్రారంభంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మరో భారీ వంతెన అందుబాటులోకి వచ్చినట్లైంది. భాగ్యనగరంలో ఇప్పటికే అతి పొడవైన స్టీల్ వంతెన 2.3 కిలోమీటర్ల పొడవుతో ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు ఉంది. తాజాగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని 3.32 కి.మీ.ల పొడవుతో రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ వంతెన చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్ నగర్‌లోని యాదగిరి థియేటర్ వరకు ఉంది. కాగా, వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నాలుగు లేన్ల ఈ బ్రిడ్జి నిర్మాణానికి 2020లో శంకుస్థాపన జరిగింది. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో నల్లగొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు 5 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం లభించింది.

### ఎంట్రీ లెవల్ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం..

# ఇక ఫ్రెషర్ల పరిస్థితేంటి?

- ఎంట్రీ లెవల్ ఉద్యోగాలను ఆక్రమిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- కెరీర్ నిచ్చెనలో తొలి మెట్టును ఏఐ తొలగిస్తోందన్న నిపుణులు
- భవిష్యత్తులో ఏఐని పర్యవేక్షించడమే జూనియర్ల ప్రధాన విధి
- అనుభవం లేకుండా నైపుణ్యాలు పెరగవని నిపుణుల ఆందోళన
- ఏఐకి అనుగుణంగా మారకుంటే వెనుకబడతారని హెచ్చరిక




కృత్రిమ మేధ (ఏఐ) ప్రవేశంతో అంతర్జాతీయ ఉద్యోగ విపణిలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా, మధ్యతరగతి యువతకు కెరీర్ పునాదిగా నిలిచే ప్రారంభ స్థాయి (ఎంట్రీ–లెవల్) ఉద్యోగాలపై 'ఏఐ' ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. గతంలో నూతన ఉద్యోగులు చేసే సాధారణ, రిపీటెడ్ టాస్క్‌లను ఇప్పుడు 'ఏఐ' వేగంగా భర్తీ చేస్తుండటంతో, సంప్రదాయ కెరీర్ గమనంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా - మిగతా3లో

### 1000 రోజుల ప్రజాపాలన..

### గాంధీ భవన్‌లో

# అంబరాన్నంటిన సంబరాలు..

- మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్.. టపాసులు, బ్యాండ్ బాజాలతో కాంగ్రెస్ శ్రేణుల సందడి..
- రైతు రుణమాఫీ నుంచి ఇందిరమ్మ ఇండ్ల వరకు.. ప్రజా సంక్షేమమే రేవంత్ సర్కార్‌కు శ్రీరామరక్ష.



**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నాంపల్లి గాంధీ భవన్‌లో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) ముఖ్య అతిథిగా హాజరై మెట్టు సాయికుమార్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాలుస్తూ, బ్యాండ్ బాజాల మేళతాళాలతో నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు - మిగతా3లో



### తెలంగాణ ముఖ్యమంత్రి

# కీలక నిర్ణయాలు

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ మేరకు గవర్నర్‌కు ఇప్పటికే సిఫారసు పంపించారు. తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా ఉన్న డా. జి. చిన్నారెడ్డి నియామకాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించారు. డా. జి. చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మిని తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా నియమించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, హైదరాబాద్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియామకానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా మాజీ రాజ్యసభ సభ్యురాలు జి. సుధారాణి నియామకానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.

### కొండా సురేఖ

# బర్తరఫ్..

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** కొండా సురేఖను బర్తరఫ్ చేస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. కొండా సురేఖ బర్తరఫ్ లేఖను గవర్నర్‌కు పంపించారు. రాజీనామాకు కొండా సురేఖ అంగీకరించకపోవడంతో లోక్‌భవన్‌కు సీఎంవో లేఖ పంపించింది. మరోవైపు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆమె రాజీనామాకు ససేమిరా అనడంతో బర్తరఫ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సమచారాం. ఇమేరకు ఢిల్లీ అధిష్టానం నుంచి సీఎంవోకు ఆదేశాలుప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమించారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిని నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.

**ససేమిరా అంటున్న సురేఖ**

తెలంగాణ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె సుస్మిత పటేల్ చేసిన తీవ్ర విమర్శల నేపథ్యంలో, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మంత్రి పదవికి రాజీనామా చేయాలని సురేఖను హైకమాండ్ ఆదేశించింది. ఈ పరిణామంతో ఆమె కేబినెట్ నుంచి వైదొలగడం ఖాయమైపోయింది. గత కొంతకాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేస్తున్న వ్యాఖ్యలు, ఆరోపణలు పార్టీలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ విచారణ జరిపి, అధిష్టానానికి ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదికను, రాష్ట్ర పార్టీ నేతల అభిప్రాయాలను తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ పెద్దలు, కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నేడు సాయంత్రంలోగా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని కొండా సురేఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఆమె స్వయంగా




తప్పుకోని పక్షంలో, తక్షణమే బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు సంబంధించిన సిఫార్సు లేఖ గవర్నర్‌కు చేరినట్లు కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి, ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లి వచ్చిన కొండా సురేఖ దంపతులు, - మిగతా3లో

### మోదీని అడిగే

# దమ్ముందా..?



- తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్
- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని - మిగతా3లో

# ఎంఐఎంలో జరుగుతోంది....

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**హైదరాబాద్ రాజకీయాల్లో తిరుగులేని పట్టున్న ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీలో తాజా పరిణామాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తప్పించడమే కాకుండా, ఎమ్మెల్సీ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశించినప్పటికీ, ఆయన ఇంకా రాజీనామా సమర్పించకపోవడం తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.పార్టీ ప్రతిష్టను కాపాడుకునేందుకు ఎంఐఎం నాయకత్వం రహ్మత్ బేగ్‌పై వెంటనే బహిష్కరణ వేటు వేసి, శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, ఆయన మాత్రం మండలి చైర్మన్‌కు రాజీనామా లేఖను సమర్పించడానికి ఏమాత్రం సుముఖంగా లేరన్న వార్తలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లడం, తన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. పార్టీ అధిష్ఠానం ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఆయన స్వచ్ఛందంగా పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేరనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో రహ్మత్ బేగ్ ఒక వీడియో ద్వారా తన వాదనను వినిపించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. తనను, పార్టీని రాజకీయంగా దెబ్బతీసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఏఐ ఉపయోగించి మార్ఫింగ్ వీడియోలను సృష్టించి ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంతో




పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి గానీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి గానీ లేదా ఎంఐఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కుట్రపై న్యాయపోరాటం చేస్తానని చెబుతూ ఇప్పటికే పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.సాధారణంగా ఎంఐఎం అధిష్ఠానం ఆదేశిస్తే నాయకులు ఎదురుచెప్పే పరిస్థితి ఉండదు. కానీ, రహ్మత్ బేగ్ రాజీనామా విషయంలో నాన్చుడు ధోరణి ప్రదర్శించడం పార్టీ కేడర్‌తో పాటు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఒకవేళ బేగ్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం లేదా అనర్హత వేటు కోసం మండలి చైర్మన్‌ను ఎంఐఎం ఆశ్రయిస్తుందా? లేక అంతర్గతంగా ఆయనపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తుందా? అనేది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా మారింది. రహ్మత్ బేగ్ సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తే, ఇటీవల ఆయన సౌదీ అరేబియాలో ఉమ్రా తీర్థయాత్రకు సంబంధించిన పోస్టు తప్ప ఎలాంటి తాజా అప్‌డేట్‌లు లేకపోవడం గమనార్హం.మొత్తానికి, పాతబస్తీ రాజకీయాల్లో రహ్మత్ బేగ్ ఎపిసోడ్ ఎంఐఎం అధిష్ఠానానికి పెద్ద పరీక్షగా మారింది. ఆయన రాజీనామా లేఖ చైర్మన్‌కు చేరుతుందా లేదా న్యాయపరమైన, రాజకీయపరమైన పోరుకు ఆయన సిద్ధపడుతున్నారా అనేది రానున్న 24 నుంచి 48 గంటల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## కొండా సురేఖ వ్యవహారంపై
# రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**కొండా సురేఖ వివాదంపై స్పందించిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

**ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని స్పష్టీకరణ**

**కొండా సురేఖ చేసిన తప్పుల రికార్డు హైకమాండ్ వద్ద ఉందని వ్యాఖ్య**

**పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలని సూచన**

తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కొండా సురేఖకు సంబంధించిన పూర్తి నివేదిక హైకమాండ్ వద్ద ఉంది. పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠానమే పర్యవేక్షిస్తుందని తెలిపారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తన పూర్తి దృష్టి కార్యకర్తల సంక్షేమంపైనే ఉందని పేర్కొన్నారు. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌కు లేఖ రాశారన్న వార్తల నేపథ్యంలో ఈ రాజకీయ పరిణామాలు ప్రాధాన్యం



# కొండా సురేఖ బర్తరఫ్..

- **మొదటి పేజీ తరువాయి**

అక్కడి పరిణామాలపై గురువారం మీడియా సమావేశంలో వివరణ ఇవ్వాలని భావించారు. అయితే, వారు స్పందించేలోపే అధిష్టానం ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. కొండా సురేఖ అనుచరులు, కార్యకర్తలు ఈ వార్తతో షాక్‌కు గురయ్యారు.

**పనిచేయని ఒత్తిడి**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం చినికి చినికి గాలివానలా మారుతున్నట్లు తెలుస్తోంది. బుధవారం ఢిల్లీలో జరిగిన పరిణామాలతో ఈ వివాదం పతాక స్థాయికి చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అయినా తనకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు పంపడమే తప్పని కొండా సురేఖ మరోసారి స్పష్టం చేసినట్లు సమాచారం.పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి ఎలా అంటారని ఆమె ప్రశ్నించినట్లు తెలిసింది. అంతేకాకుండా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలపై వచ్చిన కమీషన్ల ఆరోపణల సంగతేంటని నిలదీసినట్లు చెప్పుకుంటున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా, మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి వస్తే తాను పార్టీకి భిన్నమైన వైఖరి తీసుకుంటాననే సంకేతాలు పంపినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం ఒత్తిడి వ్యూహమా లేక కొండా కుటుంబం వద్ద 'ప్లాన్ బి' ఏదైనా ఉందా అనే కోణంలో పార్టీలో చర్చ మొదలైంది.ఇదే సమయంలో, వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా సంచలన వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. బయటి నుంచి వచ్చిన వారు పార్టీని కబ్జా చేయాలని చూస్తున్నారని, తెలంగాణలో మళ్లీ వైఎస్సార్ పాలన తెస్తామని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అటు ఢిల్లీలో సురేఖ, ఇటు తెలంగాణలో రాజగోపాల్ రెడ్డి ఒకేసారి కీలక వ్యాఖ్యలు చేయడం కాకతాళీయమేనా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.వాస్తవానికి, సీఎంపై తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను సురేఖ మొదట్లోనే ఖండించి ఉంటే వివాదం ఇంత దూరం వచ్చేది కాదని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. భర్తకు ఎమ్మెల్సీ పదవి కోసం మొదలుపెట్టిన ఒత్తిడి వ్యూహం, చివరికి సురేఖ మంత్రి పదవికే ఎసరు తెచ్చిందా అన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

# కొండా వివాదం.. సునామీయేనా

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**తెలంగాణ మంత్రివర్గంలో మునుపెన్నడూ లేని విధంగా రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించడం దాదాపు ఖాయమైనట్లేనని గాంధీ భవన్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మల్లికార్జున ఖర్గేలతో భేటీ అయి పార్టీ క్రమశిక్షణ, మంత్రి వైఖరిపై స్పష్టమైన సమాచారం అందించినట్లు తెలుస్తోంది. అయితే, ఆమె చేత ముందే రాజీనామా చేయించాలా లేక రాబోయే కేబినెట్ విస్తరణలో భాగస్వామ్య మార్పుగా చూపి గౌరవంగా పక్కన పెట్టాలా అనే అంశంపైనే అధిష్టానం కసరత్తు చేస్తోంది.ఈ వివాదానికి ప్రధాన కారణం మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత కాంగ్రెస్ నాయకత్వం , సీఎం రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకుని చేసిన తీవ్రమైన వ్యాఖ్యలే . ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఈ వ్యవహారంపై నివేదికను సేకరించి అధిష్టానానికి నివేదించింది. కేవలం ఒక బీసీ మహిళా మంత్రిపైనే వేటు వేస్తే సమాజంలో లేదా పార్టీ వర్గాల్లో ప్రతికూల సంకేతాలు వెళ్తాయనే భావనతో, ఈ మార్పును కేవలం సురేఖ తొలగింపుగా కాకుండా పూర్తి స్థాయి కేబినెట్ పునర్వ్యవస్థీకరణగా చూపించేందుకు కాంగ్రెస్ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు.మరోవైపు, ఈ పరిణామాలను కొండా దంపతులు తేలిగ్గా తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. తాము దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించామని, తమను కేబినెట్ నుంచి ఏకపక్షంగా తొలగిస్తే ఊరుకునేది లేదని వారు పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఒకవేళ బలవంతంగా పదవి నుంచి తప్పిస్తే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి వరంగల్ ఈస్ట్ స్థానానికి ఉపఎన్నిక తీసుకువచ్చే ధోరణిలో వారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు తెచ్చిపెట్టడం ఖాయం. కాంగ్రెస్ అధిష్టానానికి ఇది అత్యంత క్లిష్టమైన సమస్యగా మారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకురాలిగా ఉన్న కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే, ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని విమర్శించే అవకాశం ఉంది. ఈ రాజకీయ నష్టాన్ని భర్తీ చేసేందుకే మన్నూర్ కాపు సామాజిక వర్గానికే చెందిన విప్ ఆది శ్రీనివాస్ లేదా ఇతర సీనియర్ బీసీ నేతలకు మంత్రివర్గంలో చోటు



కల్పించాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ వంటి ఇతరుల ప్రవేశంపై కూడా ఊహాగానాలు సాగుతుండటంతో, కేవలం ఒకే మంత్రిని టార్గెట్ చేశారనే భావనను తగ్గించేందుకు అధిష్టానం శ్రమిస్తోంది. అయితే కొండా దంపతుల తిరుగుబాటు నైజం తెలిసిన కాంగ్రెస్ పెద్దలు, ఆమెను అసంతృప్తికి గురికాకుండా ఇతర కీలక నామినేటెడ్ పోస్టుతో నచ్చజెప్పే ప్రయత్నాలు కూడా సమాంతరంగా సాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి తన పాలనాపరమైన, పార్టీ పరమైన పట్టును నిరూపించుకోవడానికి ఈ నిర్ణయం కీలకంగా మారింది. ఒకవేళ కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించి, ఆమె తిరుగుబాటు బావుటా ఎగరేస్తే తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేధాలు రచ్చకెక్కడం ఖాయం. రాబోయే ఢిల్లీ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

## ఎంట్రీ లెవల్ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం.. ఇక ఫ్రెషర్ల పరిస్థితేంటి?

- **మొదటి పేజీ తరువాయి**

ఏదైనా సంస్థలో చేరిన కొత్త ఉద్యోగి, ప్రాథమిక స్థాయి పనులు చేస్తూ సీనియర్ల పర్యవేక్షణలో వృత్తిపరమైన మెళకువలు నేర్చుకుని ఉన్నత స్థానాలకు ఎదుగుతుంటారు. అయితే, ఏఐ ఈ 'తొలి మెట్టు'ను కాలరాస్తోందని టాలెంటిఫై-ఎక్స్ వ్యవస్థాపకుడు చేతన్ మంగళ్వేఢే అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో జూనియర్ ఉద్యోగులు కేవలం విధులు నిర్వర్తించడం కాకుండా, 'ఏఐ' నీతీరును పర్యవేక్షించడం, అందులోని లోపాలను సరిదిద్దడం, కస్టమర్ల అవసరాలను లోతుగా అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలను కలిగి ఉండాలని ఆయన వివరించారు. ఏఐ కేవలం ఉద్యోగాలను భర్తీ చేయడం మాత్రమే కాకుండా, కెరీర్ ఎదుగుదల క్రమాన్నే సమూలంగా మార్చేస్తోందని మాస్టెక్ సీహెచ్ఆర్ఓ విమల్ డాంగ్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జూనియర్ రోల్స్‌లో రిపీటెడ్ టాస్క్‌ల కంటే సంక్లిష్ట సమస్యలు పరిష్కారం, విచక్షణ, బృందంతో కలిసి పనిచేయడం, నిరంతరం అభ్యాసం వంటి అంశాలపైనే ప్రధాన దృష్టి ఉంటుందన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రూపాంతరం చెందడంలో విఫలమవ్వడమే అసలైన ప్రమాదమని 'ఏఐ ఉ బియాండ్' సీఈవో జస్‌ప్రీత్ బింద్రా హెచ్చరించారు. మరోవైపు, ఇన్ఫోసిస్‌కు చెందిన తృప్తి రైకర్ ఈ పరిమాణాలపై భిన్నమైన విశ్లేషణ చేశారు. 'ఏఐ' రాకతో జూనియర్ ఉద్యోగాలు మరింత అర్థవంతంగా, సృజనాత్మకంగా మారే అవకాశం ఉందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఇందులో ఒక ప్రధాన సవాలు పొంచి ఉందని ఆమె గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో పని అనుభవం లేని పక్షంలో సరైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం అలవడదు. వ్యయ నియంత్రణ కోసం కంపెనీలు జూనియర్ల నియామకాలను నిలిపివేస్తే, భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన నిపుణుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. మొత్తంమీద, ఏఐ కారణంగా ఉద్యోగాలు పూర్తిగా కనుమరుగవ్వడం కంటే, యువత తమ కెరీర్‌లో తొలి అవకాశాన్ని అందిపుచ్చుకుని పని నేర్చుకునే సంప్రదాయ మార్గం అదృశ్యమవ్వడమే పెను సవాల్‌గా మారనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## 1000 రోజుల ప్రజాపాలన.. గాంధీ భవన్‌లో అంబరాన్నంటిన సంబరాలు..

- **మొదటి పేజీ తరువాయి**

పంచుకుని ప్రజాపాలన విజయాన్ని ఆనందంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలు, రైతులు, మహిళలు, యువత జీవితాల్లో సానుకూల మార్పును తీసుకొస్తున్నాయని మెట్టు సాయికుమార్ అన్నారు. పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. "ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలే బలం" అని పేర్కొన్న ఆయన.. ప్రజా సంక్షేమాన్ని మరింత విస్తరించడంతో పాటు తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజలు, పార్టీ శ్రేణులు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

## ప్రజలకే మేం జవాబుదారీ

- **మొదటి పేజీ తరువాయి**

అన్నారు.యాభై కోట్లు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి కొన్నాడు అని తిట్టిపోసిన వాళ్ళని ఎందుకు వదిలేశారు. ప్రజలనుండి రాజకీయాల్లో పైకి వచ్చాం... ప్రజలకే మేం జవాబుదారీ. కడియం శ్రీహరి కూడా నాగురించి మాట్లాడుతున్నాడు.నా కూతురు అంటే నన్ను తీసేస్తారా..? నాకు చెప్పాపెట్టకుండా నన్ను తీసేస్తారా..? నాకు జరిగిందే మీకు జరుగుతుంది..! ఇబ్బంది పడుతున్న నేతలారా.. బయటకు రండి.. గళం విప్పండని అన్నారు.ప్రభుత్వంలో జరుగుతున్న వ్యవహారాలపై నోరు విప్పండి. లేదంటే నష్టం తప్పదు.. నా పదవి తీసేయడం వేరు.. నాకు ముందే చెప్పాల్సింది. బీసీ రిజర్వేషన్లు మేము చేశాం అంటున్న సీఎం రేవంత్ ఒక బీసీ మహిళ మంత్రి పదవి ఎలా తీసేసారో చెప్పాలి. ప్రభుత్వం సర్దుకోవాలి.. మార్చుకోవాలి.. మున్సిపల్ కార్పొరేషన్స్ ఎన్నికలు రాబోతున్నాయి.మోనోపోలీ వ్యవహారం తప్పు..నేను పదేళ్లు సీఎం అని ఆయనకు ఆయన చెప్పుకోవడం తప్పు.ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడం తప్పని అన్నారు. మీడియా సమావేశంలో ఆమె లేఖ విడుదల చేసారు. .అందులో అన్ని అంశాలు పేర్కొన్నట్లుగా చెప్పారు.

## తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇవ్వరా..?

- **మొదటి పేజీ తరువాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై తీవ్ర విమర్శలు గుప్పించారు.నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు శనిలా దాపురించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ రైతుల కళ్లల్లో నీళ్లు తెప్పించిన 'నీళ్ల మంత్రి' ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలనూ కేటీఆర్ ప్రస్తావించారు. సొరంగంలో 'వాటర్‌లో నీళ్లు కలిశాయి' అంటూ మంత్రి మాట్లాడారని.. అసలు ఆయన 'క్వార్టర్‌లో నీళ్లు కలిశాయో ఏమో' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హుజూర్‌నగర్‌లో నీళ్ల కోసం రైతులు తమ బాధలు చెప్పుకుందామంటే వారిని గెదుముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వ్యవహారం కూడా అందుకు భిన్నంగా లేదని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారని, అందుకే తెలంగాణ నీళ్లు కిందికి పోతున్నా మాట్లాడటం లేదని ఆరోపించారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి లోపు రైతులకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిలోగా నీళ్లు ఇవ్వకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. ఈనెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు నీళ్లు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మోదీని అడిగే దమ్ముందా..?

- **మొదటి పేజీ తరువాయి**

సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

## అన్నీ వివరాలు అధిష్టానానికి చెప్పాను

**మంత్రి సురేఖ**



**హైదరాబాద్:**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఢిల్లీ పర్యటన ముగించుకుని బుధవారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. అనంతరం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో మీడియాతో ఆమె మాట్లాడారు ఢిల్లీలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిశానని తెలిపారు. తనకు జరుగుతున్న పరిణామాలను వారికి వివరించానని అన్నారు. తాను చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకుని ఆలోచన మేరకు నిర్ణయం తీసుకుంటామని అధిష్టానం హామీ ఇచ్చినట్లు మంత్రి కొండ సురేఖ వెల్లడించారు

## బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు: కొండా సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్

**కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమన్న శ్రీనివాస్ గౌడ్**

**ఈ కఠిన నిర్ణయం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచన ఉందని మండిపాటు**

**ఎంతోమంది కాంగ్రెస్ నేతలు రేవంత్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్య**



తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

## రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని మాజీ మంత్రి హరీశ్రావు హితవు పలికారు. అంబర్ పేట బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాట్లలకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ పై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. మైకు దొరికితే కేసీఆర్ను విమర్శించడమే అజెండాగా పెట్టుకున్నారని స్పష్టం చేశారు. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు ఆయన రాజకీయ సంస్కారానికి అడ్డం పడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు మాని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఎన్నికల హామీల అమలుపై సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## సేవామూర్తుల స్మృతికి స్మారకం

**పెరిక గోపాల్, రాజరత్నం విగ్రహాల ఆవిష్కరణ**



**చీకటి వెలుగు నల్లగొండ:**ప్రజా జీవితంలో విశేష సేవలందించిన మాజీ నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కీ.శే. పెరిక గోపాల్, మాజీ ఎమ్మెల్యే కీ.శే. పెరిక రాజరత్నం విగ్రహాలను గురువారం నల్లగొండ ప్రకాశం బజార్ కూరగాయల మార్కెట్ కూడలిలో ఆవిష్కరించారు. 16వ డివిజన్ కార్పొరేటర్ పెరిక స్వాతి వినాయకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సేవామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను భావితరాలకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. పెరిక గోపాల్, పెరిక రాజరత్నం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని కోరారు. కార్పొరేటర్ స్వాతి వినాయకరాజు మాట్లాడుతూ తన మామయ్యలు అందించిన సేవలను స్మరించుకోవడం తమ కుటుంబానికి గర్వకారణమన్నారు. వారి స్ఫూర్తితోనే ప్రజాసేవలో కొనసాగుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గురు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గుమ్మల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, .పెరిక రాజరత్నం కుటుంబ సభ్యులు, కుమారులు పెరిక ఉమామహేశ్వర్ రాజు, పెరిక కరంజయరాజు, పెరిక వినాయకరాజు తదితరులు పాల్గొన్నారు.కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు

# బీసీలకు ద్రోహం చేస్తున్న మోదీ ప్రభుత్వం

## కులగణనపై వెనక్కి తగ్గితే దేశవ్యాప్త ఉద్యమం: జాజుల శ్రీనివాస్‌గౌడ్

**చీకటి వెలుగు నల్లగొండ:** బీసీ కులగణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బీసీ కులగణనపై నల్లగొండలోని బీసీ సంక్షేమ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రధర రామరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం పనిచేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తయినా బీసీలకు చెప్పుకోదగిన న్యాయం చేయలేదని ఆరోపించారు. బీసీలను ఓబీసీలుగా గుర్తించి దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. దేశంలో బీసీలు ఉత్పత్తి కులాలుగా కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. దేశ జనాభాలో సుమారు 80 శాతం మంది వివిధ ఉత్పత్తి వృత్తులతో అనుబంధం ఉన్న కులాలకు చెందినవారేనని, దేశ సంపద సృష్టిలో వారి శ్రమకు ప్రధాన పాత్ర ఉందని పేర్కొన్నారు. వ్యవసాయం, చేతివృత్తులు, కులవృత్తులు, పారిశ్రామిక రంగాలతో పాటు అనేక ఉత్పత్తి రంగాల్లో బీసీల కృషి కీలకమన్నారు. బీసీ కులాల్లో 136 కులాలు ఉన్నాయని, వివిధ రాష్ట్రాల్లో ఆయా కులాలకు భిన్నమైన పేర్లు, గుర్తింపులు ఉన్నందున దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించడం అత్యవసరమని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కులగణన ద్వారా బీసీల వాస్తవ



జనాభాతో పాటు వారి సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులు స్పష్టమవుతాయని తెలిపారు. కులగణన లేకపోవడంతో బీసీలు రాజకీయంగా, విద్య, ఉద్యోగాలు, పదోన్నతులు తదితర రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 29 రాష్ట్రాల్లో ఉద్యమ కార్యాచరణ కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. 29 రాష్ట్రాల్లో ఉద్యమ కార్యాచరణను నిర్మించి, బీసీ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అవసరమైతే దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టి పార్లమెంట్ ముట్టడికి కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. బీసీల హక్కుల సాధన కోసం బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటు ఉద్యమాన్ని ప్రారంభిస్తామని అన్నారు. మండల్ కమిషన్ సిఫారసుల అమలు కోసం దేశంలో బీసీ ఉద్యమం ఉధృతంగా సాగిన సమయంలో బీజేపీ కమండల్ ఉద్యమాన్ని తెరపైకి తీసుకువచ్చి బీసీ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించిందని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ప్రస్తుతం కూడా అదే తరహాలో కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. బీసీల సమగ్ర కులగణన నిర్వహించి, జనాభా ప్రాతిపదికన వారికి హక్కులు, రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేర్ల కంటి కాషయ్య,నేలపల్లి సత్యనారాయణ,శ్రీనివాస్ ముదిరాజ్,కంది సూర్యనారాయణ,నల్లసోమ మల్లయ్య, కాశయ్య,వాడపల్లి సాయిబాబా, కేశబోయిన శంకర్ గౌడ్,తో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాలకు అవమానం సహించం

**సంతు రవిదాస్ చిత్రపటానికి నల్లరంగు పూయడం దుర్మార్గం**

**బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ**

**చీకటి వెలుగునల్గొండ :**మహనీయుల విగ్రహాలను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ అన్నారు. గురువారం స్థానిక డా.బి.ఆర్ అంబేడ్కర్ గారి విగ్రహం వద్ద బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ ఆదేశానుసారం సంత్ రవిదాస్ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. .ఈ సందర్భంగా బాకీ నరసింహ గారు మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ మహారాజ్ వంటి మహనీయుల చిత్రపటాలకు నల్లరంగు పూయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని సంబధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహనీయుల ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారి విగ్రహాలను అవమానించడం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు.రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ మహనీయుల పట్ల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు, అవమానకర చర్యలకు దారితీయడం మంచిది కాదని పేర్కొన్నారు. ఇటీవల బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజకీయ కక్షలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రవిదాస్ మహారాజ్ గారిని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మహనీయుల గౌరవాన్ని కాపాడుతూ, వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ ఎస్సీ మోర్చా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక ఎస్సై గారికి పిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చింత ముత్యాల రావు, కార్యాలయ కార్యదర్శి మంగళపల్లి కిషన్, మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ నెవర్సు నీరజ, మండల అధ్యక్షులు బొగరి అనిల్ కుమార్, వన్ టౌన్ ఇంచార్జి పెరిక నరసింహ, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చినేని జాని, ఎస్సీ మోర్చ సీనియర్ నాయకులు కొమ్ము రాందాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి వెంకన్న, పుల్లెంల శ్యామ్, చామకూరి మహేష్, జిల్లా కోశాధికారి అదిమల్ల దేవేందర్, కొత్తపల్లి ప్రమోద్, మహిళా నాయకురాలు గూగులోతు తార, కందుకూరి సుధాకర్, చింతపల్లి వెంకన్న, మర్రి ఏడుకొండలు, పోత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.







# భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్ల పైన దాడికి కుట్రపన్నడం హేయమైన చర్య

**- దాసరి సాయికుమార్ బిజెపి కార్పొరేటర్**

**చీకటి వెలుగు నల్లగొండ:**నల్లగొండ పట్టణం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల గత రెండు రోజుల నుంచి జరుగుతున్నటువంటి పరిణామాలలో భాగంగా రాజకీయ అసహనంతో కుట్రపూరితంగా బిజెపి కార్పొరేటర్ల పైన... కొంతమంది కాంగ్రెస్ నాయకులు దాడికి దిగాలని ప్రయత్నించి మా ఇండ్ల వరకు వచ్చి ఇబ్బంది పెట్టే పరిస్థితి మునిపెన్నడూ లేని విధంగా నల్లగొండ పట్టణంలో చోటుచేసుకుంది.. కేవలం బిజెపి పార్టీ ఎదుగుదల పార్టీ కార్పొరేటర్స్ ప్రజలతో మమేకమై సుపరిపాలన అందించడమే.. కాంగ్రెస్ నాయకులకు కంటగింపుగా మారిందని బిజెపి కార్పొరేటర్ దాసరి సాయికుమార్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ప్రజల పట్ల విశ్వాసంతో ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్ల పైన ముఖ్యంగా నా ఇంటి పైన కాంగ్రెస్ నాయకులు దాడి చేసే ప్రయత్నం చేసి మమ్మల్ని మా కుటుంబ సభ్యుల్ని ఇబ్బంది పెట్టాలని చూశారు ఈ దాడికి పాల్పడడానికి గల కారణాలు మేము నల్లగొండ 48 డివిజన్ పరిధిలో గల అభివృద్ధి పైన నిధుల దుర్వినియోగం పైన ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిలదీయడంతో మాపై కక్ష సాధింపు చర్యగా కుట్రపూరితంగా దాడులకు పాల్పడాలనే వ్యూహరచన జరిగిందని కేవలం భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన మాట్లాడుతుందని ప్రజల ఆస్తులను కాపాడే ప్రయత్నంలో భాగంగా వారు కడుతున్నటువంటి పనుల రూపంలో వచ్చిన డబ్బులను అభివృద్ధికి మాత్రమే వాడాలని దుబారా ఖర్చులు చేయొద్దని మేము కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడినందుకు వారిని నిలదీసినందుకు మాపై కుట్ర పన్ని మమ్మల్ని ఇబ్బంది పెట్టె ప్రయత్నం చేయడం జరిగింది... ఇలాంటి తాటాకు చప్పట్లకు మేం భయపడమని మీరు ఎన్ని దాడులకు పాల్పడ్డ మమ్మల్ని ఎన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసిన మేము ఎప్పుడూ కూడా ప్రజల పక్షాన నిలుస్తానని నేను ఇప్పటికీ మా కుటుంబం నుంచి రెండోసారిగా కౌన్సిల్లో అడుగుపెట్టామని ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ కూడా నాకు మా కుటుంబ సభ్యులకు ఉంటుందని అన్నారు... మాపై దాడికి ప్రయత్నించినటువంటి వారి మీద నల్లగొండ 2వ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు కూడా నేను ఫైల్ చేయడం జరిగింది . మేము ఎప్పుడు కూడా ప్రజల పక్షమే ఉంటాం మేము వ్యక్తిగత రాజకీయాలు చేయడం కేవలం రాజకీయం అన్నది ఎన్నికల మాత్రమే మా పరువు పరిమితం చేసుకుంటూ మిగతా అభివృద్ధిపైనే కాలాన్ని మేము ప్రజల పక్షాన కేటాయిస్తామని చిల్లర రాజకీయాలకు మేము దూరంగా ఉంటామని తెలియజేస్తూనాన్నని అన్నారు. బీజేవైఎం నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షులు వంగూరి రాఖీ మాట్లాడుతూ.. ఇటీవల నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో రాజకీయ అలజడి కేవలం ఈ ప్రజాస్వామ్య పరిపాలనలో భారత రాజ్యాంగం ఇచ్చినటువంటి హక్కులను వెళ్లబుచ్చుకొని మేము మా రాష్ట్ర పార్టీ కార్యాలయం మీద కాంగ్రెస్ నాయకులు



చేసినటువంటి దాడికి నిరసనగా నల్లగొండ కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేయడం జరిగింది అక్కడ ఈ ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు అందరికీ ఉంటుంది మేము ఎవరిని ఇబ్బంది పెట్టలేదు ఎవరికి ఇబ్బంది కలిగించలేదు కేవలం మా నిరసనలు మాత్రమే తెలియజేశాం . కానీ కొంతమంది కాంగ్రెస్ నాయకులు పనిగట్టుకుని వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలో భాగంగా భారతీయ జనతా పార్టీ కార్యాలయం పైన దాడి చేయడమే కాకుండా మా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి గారి తల్లిగారు ఉంటున్నటువంటి నివాస ప్రాంతంలో ఆ నివాసం మీద కేవలం ఒక మహిళ అని కూడా చూడకుండా ముక్కుమూడిగా రౌడీముఖల్లాగా ఇంట్లోకి చేరి కనీస స్పృహలో లేకుండా ఇష్టానుసారంగా దౌర్జన్యం చేస్తూ నోటితో చెప్పడానికి వీలు లేనటువంటి పదాలను వాడుతూ వారి ఇష్టారాజ్యంగా ఇంట్లో ఉన్నటువంటి వస్తువులను సామాగ్రిని పగలగొడుతూ నాగం వర్షిత్ రెడ్డి గారి తల్లిని భయభ్రాంతులకు గురి చేస్తూ దాడి చేసే ప్రయత్నం చేయడం జరిగింది . ఇలాంటి క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నటువంటి వ్యక్తులు సమాజంలో పెద్ద మనుషులుగా చలామనవతు రాజకీయ పదం కోసం వ్యక్తిగత దాడులకు పాల్పడడం నిజంగా ఈ ప్రజాస్వామ్యంలో ప్రజా పరిపాలన సాగిస్తున్నామని చెప్పుకుంటున్నటువంటి వ్యక్తులు దీనికి ఏం సమాధానం చెప్తారో చూడాలి నల్లగొండలో జరుగుతున్నటువంటి ఈ వ్యక్తిగత దాడుల పట్ల నల్లగొండ ప్రజలే కాకుండా నల్గొండ జిల్లా తెలంగాణ రాష్ట్ర మొత్తం కూడా ఈ నల్లగొండ వైపు తొంగి చూస్తుంది ప్రజల గమనిస్తున్నారని కనీస అవగాహన లేకుండా ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి నాయకుల పైన ఈ జిల్లాకు జాతీయ పార్టీ సంబంధించినటువంటి వ్యక్తి ఈ నల్లగొండ జిల్లాకు అధ్యక్షుడిగా ఉన్నటువంటి డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి గారి తల్లి ఇంటి పైన దాడి చేయడం అంటే ఇంత దౌర్జన్యకాండ ఈ తెలంగాణ రాష్ట్రంలో దాపరించిందంటే ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టే ఇలాంటి విర్రవీగచేతలు చేస్తా ఉన్నారు అధికారమనేది శాశ్వతం కాదు కానీ ఇలాంటి తాటాకు చప్పులకు మేము భయపడేది లేదు వెంటనే వారి పైన చట్టపరమైనటువంటి చర్యలు తీసుకొని ఇలాంటి వ్యక్తులను అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టాలని పోలీసు వారిని కూడా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు... ప్రజల చేత ఎన్నుకున్న కార్పొరేటర్ లను వ్యక్తిగత కారణాల చేత తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే ఇలాంటి దారుణలకు పాడుతున్నారని అన్నారు.. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తులం భారత రాజ్యాంగాన్ని గౌరవించేటువంటి వ్యక్తులు కాబట్టే మేము కూడా దాడులకు పాల్పడేటువంటి శక్తి సామర్థ్యాలు మాకు కూడా ఉన్నాయి అని కానీ కేవలం ప్రజాస్వామ్యంలో ఉన్నటువంటి వ్యక్తులుగా సంస్కారం గా ఉన్నటువంటి వ్యక్తులుగా మేము చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెరిగినటువంటి వాతావరణం మా పార్టీ కున్న నిబద్ధత కారణాల చేత మేము మేము చట్టపరంగా చట్టాన్ని నమ్ముకొని ముందుకు పోయేటువంటి వ్యక్తులు కాబట్టి పోలీస్ శాఖ వారిని కూడా ఒక్కటే కోరుతున్నాం మేము మా అధ్యక్షుని ఇంటి పైన మా కార్యకర్తల పైన మరియు మా కార్పొరేటర్ల పైన దాడికి ప్రయత్నించినటువంటి వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టవలసిందిగా పోలీసు వారిని కూడా విజ్ఞప్తి చేస్తా ఉన్నాను అని అన్నారు..ఇందులో.. దాసరి సాయికుమార్, వంగూరి రాఖీ, అక్కేపల్లి బలరాం.. దుర్గ, వెంకటేష్ పాల్గొన్నారు

Printed, Published & Owned by **KANDI SURYA NARAYANA,** Printed at Parthasarathi Offset Printers, Prakasham Bazar, Nalgoda - 508 001, T.G
Editor : **KANDI SURYA NARAYANA,** D.No. 5-6-109/B1, Bottuguda Nalgonda-508 001, T.G. Cell : 98480 52327, , **Email : cheekativelunewsdaily@gmail.com**